అభివాదం చేస్తున్న ఎపిజెసి అమరావతి నేతలు

గెలుపు కోసం ఏమైనా చేద్దాం..!

- అధికార పార్టీ కుటిల యత్నాలు - చివరికి బెదిరింపులకూ సిద్ధం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు ఎంత వరకైనా సిద్ధపడుతున్నారు. కుటిల యత్నాలతో ఎలాగైనా నెగ్గాలని చూస్తున్నారు. చివరికి బెదిరింపులకు కూడా సిద్ధమవుతున్నారు....

అధికార పక్ష వైసిపి నాయకులు పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులు ఓడిపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత బయటపడుతుందని భావిస్తున్నారు. దీంతో తమ అభ్యర్థుల గెలుపు కోసం కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు రోజుల కిందట విద్యాశాఖ అధికారులు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలకు ఫోన్లు చేశారు. ఎలాగైనా వైసిపి అభ్యర్థులకే ఓట్లు వేయాలని, లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇటీవల అధికార పార్టీ నాయకులు నంద్యాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా తమ పట్టభద్రుల అభ్యర్థికే ఓటు వేయాలని ఒక రిటైర్డ్ ఇంజనీరును కోరారు. దాంతో ఆయన తనకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తానని చెప్పడంతో ఆయనపై ప్రచారానికి వెళ్లిన వారు దాడి చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు సదరు వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఫిర్యాదు తీసుకోకుండా అధికార పార్టీ వారితో ఎందుకు పెట్టుకుంటారు అంటూ చెప్పి పంపడం గమనార్హం. ఇలా అధికార పార్టీ నాయకులు తమ పార్టీ అభ్యర్థులకే ఓటు వేయించడానికి దాడి చేయడానికి కూడా వెనకాడటం లేదు. ఇటీవల విద్యాశాఖాధికారులు నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పైకి అధికారిక సమావేశంలాగా కనిపించినా వైసిపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించడం కోసమే ఆ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. వీటితో పాటు ప్రచారంలో పాల్గొన్నారన్న కారణంతో ఎపిటిఎఫ్ నాయకులు హృదయరాజుకు విద్యాశాఖ అధికారులు నోటీసులు అందజేశారు. పలు ప్రాంతాల్లో విద్యా శాఖ అధికారుల ద్వారా అధికార పార్టీ నాయకులు ఉపాధ్యాయ సంఘాల నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని ఫోన్ చేసిన ఓ యువతికి ఎందుకు ఓటు వేయాలని, ప్రస్తుత అభ్యర్థి తండ్రి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పాలని సమాధానం ఇచ్చారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో వ్యతిరేకత వ్యక్తమవుతోందని గమనించిన అభ్యర్థి పట్టభద్రులకు నగదును పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఇప్పటికే జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు టిఫిన్ బాక్సులు పంపిణీ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇలా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడం కోసం అధికార పార్టీ నాయకులు చేస్తున్న పనులపై అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

ఈ నెల 9 నుంచి దశలవారీగా ఉద్యమం

ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 9 నుండి దశలవారీగా ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ఎపిజెఎసి అమరావతి నేతలు వెల్లడించారు. ఈ ఉద్యమంలో ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావాలని వారు కోరారు. ఆదివారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్‌లో ఎపి జెఎసి అమరావతి కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి , ఎపిజెఎసి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణిపేరాజు , ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి మాట్లాడుతూ జీతాభత్యాల కోసం ఎదురుచూస్తూ ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని అప్పుల వాళ్ల దగ్గర తాకట్టు పెట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కనీసం జీతం ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నారని వివరించారు. ఉద్యోగులకు ఖర్చు చేయాల్సిన నిధులను ఎవరికి ఖర్చు పెడుతున్నారో ప్రభుత్వం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సి అరియర్స్ , డిఎ బకాయిలు, కొత్త డిఎ, లీవ్ ఎన్ క్యాష్ మెంట్లు, మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు ఎందుకు సకాలంలో చెల్లించడం లేదని ప్రశ్నించారు. వీటిపై లిఖితపూర్వకమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ముందుగా ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ ప్రకారం ఈ నెల 9 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఉద్యమమై కదులుతామని హెచ్చరించారు. ఇది ఉద్యోగుల ఆత్మ గౌరవ ఉద్యమమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి జెఎసి అమరావతి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి కెవై.కృష్ణ, అసోసియేట్ ఛైర్మన్ నాగ రమణయ్య, కోశాధికారి రామానాయుడు, నాయకులు శంకర్ నాయక్, అర్లయ్య, ఓంకార్ యాదవ్, వెంకట్ రెడ్డి, గిడ్డయ్య, సులోచనమ్మ, ఎవి.రెడ్డి, ప్రభుత్వ డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.నాగశివలీల

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

'మహిళలు స్వయం సహాయకంగా అభివృద్ధి చెంది ఎదగాలన్నదే మెప్మా ప్రధాన లక్ష్యం. మహిళా సాధికారత కోసం మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడుతున్నారు. వారు పొదుపు చేసుకున్న డబ్బులను బ్యాంకులలో దాచుకొని బ్యాంకులు ఇచ్చే రుణాలతో వ్యాపారాలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి పదిమంది ఎదగాలన్నదే ముఖ్య లక్ష్యం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మార్టులు ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ సమిష్టి వ్యాపారం చేసుకోవడానికి కావల్సి శిక్షణ కూడా ఇవ్వాలనుకున్నాం.'అని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.నాగ శివలీల అన్నారు. ప్రజాశక్తితో ముఖాముఖిలో అనేక అంశాలను వివరించారు.

మీ ఉద్యోగ ప్రస్థానం ఎక్కడెక్కడ ఎలా సాధింగి?

పిడి : ఎం కామ్ ,ఎంబిఎ పూర్తి చేశాను. తొలిసారి 2007 లో చిత్తూరు జిల్లా విజయపురిలో ఎంపిడిఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. చిత్తూరులో ఐదు సంవత్సరాలు, హైదరాబాదు సెర్ప్‌లో నాలుగున్నర సంవత్సరాలు, కర్నూలు డిఆర్‌డిఎ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా 2017 నుండి 2022 జూన్ 31 వరకు పనిచేశాను. 2020 జూన్ నుండి డిసెంబర్ వరకు బిసి కార్పొరేషన్ ఇడి ఎఫ్‌ఎసిగా పని చేశాను. 2022 జులై ఒకటో తారీకు నుండి డిసెంబరు 15 వరకు పాములపాడు ఎంపిడిఒగా పని చేసి 2022 డిసెంబరు 16న మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలు చేపట్టాను.

జిల్లావ్యాప్తంగా ఎన్ని పొదుపు గ్రూపులుఉన్నాయి?

పిడి : ఒక్కో గ్రూపులో 10 మంది చొప్పున 14,988 గ్రూపులు ఉన్నాయి. మొత్తం 1,49,880 మంది సభ్యులు ఉన్నారు?

చిరు వ్యాపారుల గ్రూపులు ఎన్ని ఉన్నాయి?

పిడి : చిరు వ్యాపారుల గ్రూపులు 480 టార్గెట్ కాగా 434 గ్రూపులను చేశాం.

జిల్లావ్యాప్తంగా సిఒలు ఎంతమంది ఉన్నారు?

పిడి : జిల్లావ్యాప్తంగా 34 మంది సిఒలు ఉండాలి. కానీ 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. కర్నూలు నగరంలో 18 మంది పని చేయాల్సి ఉండగా పదిమంది మాత్రమే పని చేస్తున్నారు.

జిల్లాలో టిఎల్‌ఎఫ్‌లు ఎన్ని ఉన్నాయి, ఆర్పీలు ఎంతమంది ఉన్నారు? బ్యాంకుల ద్వారా ఎన్ని కోట్ల రుణాలు ఇప్పించారు?

పిడి : తొమ్మిది టిఎల్ఎఫ్ లు ఉన్నాయి. 447 మంది రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పిలు) 447 స్లమ్ లెవెల్ ఫెడరేషన్స్ (ఎస్ఎల్ఎఫ్)లు ఉన్నా రు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు రూ.200 కో ట్లు టార్గెట్ కాగా రూ.180 కోట్లు పూర్తి చేశాం.

జిల్లావ్యాప్తంగా టిడ్కో గృహాలకు ఎన్ని రుణాలు ఇచ్చారు? కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులలో టిడ్కో గృహాలకు ఎంతమందికి లోన్లు ఇప్పించారు?

పిడి : జిల్లావ్యాప్తంగా టిడ్కో గృహాలకు రూ.నాలుగు కోట్ల రుణాలు ఇవ్వాలని టార్గెట్ కాగా, నాలుగు కోట్ల 39 లక్షలు బ్యాంకు లింకేజ్ ద్వారా రుణాలు ఇప్పించాం. ఆదోని, ఎమ్మిగనూరులలో 7104 మంది టార్గెట్ కాగా, 3291 మందికి రూ. 77, 07, 75,000 రుణాలు ఇవ్వాలని టార్గెట్ కాగా అందు రూ.68, 28, 52,000 రుణాలు ఇప్పించాం. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 6112 మంది టార్గెట్ కాగా అందు 2,863 మందికి బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించాం. మిగిలినవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి.

మహిళా సాధికారత కోసం ఇంకా ఏమైనా కార్యక్రమాలు చేస్తున్నారా?

పిడి : స్వయం సహాయకంగా మహిళలు అభివృద్ధి చెందేందుకు రూ.లక్ష వరకు రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసే స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో జగనన్న మహిళా మార్టులను ఈనెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కర్నూలులో ప్రారంభించ నున్నా ము. ఈ మార్టులలో ప్రతి పొదుపు సంఘం సభ్యురాలును భాగస్వామ్యం చేసే విధంగా ఒక్కొక్కరి ద్వారా రూ.150 రూపాయలు సభ్యత్వం కట్టాలి. మొత్తం 80 వేల మంది లో 60 వేల మంది చేరిన, వారు తయారు చేసే వస్తువులను ఆ మార్టులో అమ్మకానికి పెట్టాం. ఇందులో మార్కెటింగ్ చేసేందుకు మహిళల్లో పట్టబద్రులు ఉన్నవారికి ఎంపిక చేసి వారికి తిరుపతి, చిత్తూరులలో శిక్షణ ఇప్పిస్తాం. సభ్యత్వం చేరిన వారందరికీ సభ్యత్వం కార్డు ఇస్తాం. సభ్యత్వం కార్డు ఉన్నవారు. ఈ మార్టులో ఉన్న వస్తువులు కొంటె ఎమ్మార్పీ రేట్లపై1.05 శాతం డిస్కౌంట్ ఇస్తారు. ఒక సంవత్సరం తర్వాత వచ్చిన లాభాలను మార్టులో సభ్యులుగా చేరిన వారికి మాత్రం సమానంగా పంచుతాం.



సుంకేసుల బ్యారేజీలో నీటి మట్టంను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎ .భార్గవ్ తేజ

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

నంగర పాలక సంస్థ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రస్తుత వేసవికాలంలో కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కర్నూలు నగర పాలక కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, మునిసిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ మునిసిపల్ ఇంజినీర్లతో పాటు ప్రజారోగ్య విభాగ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రస్తుతం సుంకేసుల బ్యారేజీలో నీటి మట్టం, అందులో కర్నూలు నగర పాలక ప్రజలకు అవసరమయే నీటి శాతం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక రూ.82 కోట్ల వ్యయంతో సుంకేసుల బ్యారేజీ నుంచి కర్నూలు నగర పాలక పరిధిలోని మునగాలపాడు పంపింగ్ స్టేషన్ వరకు జరుగుతున్న పైప్ లైన్ పనులను పరిశీలించారు. సుంకేసుల బ్యారేజ్ నుంచి ఈ పైప్‌లైన్ వెంట నీరు వెళ్ళటానికి వీలుగా బ్యారేజీ వద్ద ఏర్పాటు చేయనున్న పంపింగ్ మోటార్ స్టేషన్ ఏర్పాటుకు అనువుగా వుండే స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట కర్నూలు నగర పాలక ఎస్ఇ శేషసాయి, ఎఇ జనార్ధన్, అలాగే పబ్లిక్ హెల్త్ శాఖ ఎంఇ చంద్రమోహన్, డిఇ వెంకటేశ్వర్లు, ఎఇ. నాగ శంకర్ తదితరులు ఉన్నారు.

జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మేయర్ బివై.రామయ్య , తదితరులు

జోయాలుక్కాస్ షోరూం పునఃప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలులో జోయాలుక్కాస్ జ్యువెలరీ షోరూంను పునఃపారంభించారు. కర్నూలు మేయర్ బివై.రామయ్య ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం షోరూంను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేలా మరిన్ని కలెక్షన్లతో షోరూంను తరిగి ప్రారంభించారన్నారు. ప్రజలను ఆకర్షించేలా షోరూంను తయారుచేయడం శుభపరిణామమని తెలిపారు. మరిన్ని షోరూంలతో ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రజల మన్ననలు పొందాలని, మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మేనేజర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ షోరూం ప్రారంభం సందర్భంగా డైమండ్ ఆభరణాల కొనుగోలుపై 25 శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు. మార్చి 6 వరకు ప్రతి కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి పొందుతారని తెలిపారు. జ్యువెలరీ ప్రేమికులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి: సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ అభ్యర్థులు అభ్యర్థి పోతుల నాగరాజును కత్తి నరసింహారెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ పిలుపునిచ్చారు.ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ పాఠశాలల, కళాశాలల స్కావెంజర్స్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం కర్నూలు కెకె భవన్‌లో నిర్వహించారు.రాధాకృష్ణ మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులు 2005 నుండి ప్రజాసేవకు అంకితమై పని చేస్తున్నారన్నారు. చట్టసభల లోపల వెలుపల ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలబడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీం వర్కర్ల కోరికల పరిష్కారం కోసం తన సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు ఉద్యోగ కార్మికుల కోసం నిజాయితీగా పని పనిచేసే వారికి మీ ఓట్లు వేసి డబ్బు అహంకారం ఉన్న అభ్యర్థులను ఓడించాలని కోరారు. మధ్యాహ్నం భోజనం పథకం కార్మిక యూనియన్ సిఐటియు నాయకులు రజియా, హైమావతి, లీలావతి, డబ్ల్యుఎన్. రావ్, మునీశ్వరమ్మ, మాణిక్యమ్మ పాఠశాలల్లో, కళాశాలలో స్కావెంజర్ల యూనియన్ నాయకులు జయలక్ష్మి, హుస్సేనమ్మ, బజారమ్మ, పఠాన్. ఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న గురుశేఖర్ , తదితరులు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కోరుతూ సిఐటియు చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో 45వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో టీచర్స్ , పట్టభద్రులను కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గురించి ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి ఎస్. మహమ్మద్ రఫీ ఓటర్లకు వివరిస్తూ దేశాన్ని, రాష్ట్రాన్ని చిన్న వ్యాపారస్తుల సంఘం నగర నాయకులు ప్రసాద్, చందు, అశోక్ హుస్సేన్‌బాషు, శీను పాల్గొన్నారు.

కోడుమూరు : కోడుమూరు మండలం పులకుర్తి గ్రామంలో ఈరోజు పట్టభద్రులు ఎమ్మెల్సీ పోతుల నాగరాజు టీచర్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఇంటింటా తిరిగి ఓటర్లను కలుసుకొని మొదటి ప్రాధాన్యత ఓటున వేయాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి మనోహర్ , సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న, ప్రజాసంఘాల బాధ్యుడు గఫూర్ మియా మాట్లాడుతూ శాసనమండలిలో రైతుల పక్షాన ఉద్యోగ కార్మికుల పక్షాన శాసనమండలిలో ప్రజా సమస్యల పైన గళం విప్పి మాట్లాడే వారిని శాసన మండల కి మీ ఓటు ద్వారా పంపాలని వారు కోరారు

వెల్దుర్తి : వెల్దుర్తి మండలం అల్లుగుండు, బొమ్మిరెడ్డిపల్లి మల్లేపల్లిలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, నాయకులు వెంకటేష్, రాముడు, ప్రజాశక్తి రిపోర్టర్ అంజి, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు.

సి.బెళగల్ : సి బెళగల్ లో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు కు మొదటి ఓటు వేసి గెలిపించాలని ప్రజాశక్తి విలేకరి వెంకట్ జోరుగా ప్రచారం నిర్వహించారు. ఇందుకు భగత్ సింగ్ అసోసియేషన్ బందం మద్దతుగా నిలిచారు. మండల అధ్యక్షులు పోలసి వెంకటేష్, కార్యకర్తలు బద్రి, రామకృష్ణ, నత్తి వెంకటేష్, ఇస్మాయిల్,రమణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన వైద్యులతో ఎంపిపి, సర్పంచి తదితరులు

ఉల్చాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, సర్పంచి విద్యాసాగర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర అమిలియో హస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గుండెనొప్పి, షుగరు, బిపి, కంటి సమస్యలు, గ్యాస్ ట్రబుల్, మోకాళ్ళ నొప్పులు, మొలలు, ఆయాసం, దగ్గు, నడుము, మెడ, ఒళ్ళు నొప్పులు వంటి సమస్యలకు డాక్టర్లు రోగులతో మాట్లాడి తగిన పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంబంధ పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎంపిపికి, సర్పంచుకు, అమీలియా హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అక్షర శిల్పి డాక్టర్ ఆశావాది

పద్మశ్రీ డాక్టర్ ఆశావాదిప్రకాశరావు ప్రథమ వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

అవధానాచార్య, పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు అక్షర శిల్పి అని, తెలుగు రాష్ట్రాల్లో ఎందరినో అక్షర శిల్పులను తయారు చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని పలువురు కవి పండితులు, వక్తలు కొనియాడారు. ఆశావాది ప్రకాశరావు ప్రథమ వర్ధంతి సభ నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు పింగళి సూరన తోటలో నిర్వహించారు. అతిథులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. నరసం కర్నూలు అధ్యక్షులు కావెం.సుబ్బలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ముఖ్య అతిథులుగా బంధకవి అన్నమరాజు ప్రభాకరరావు, శతావధాని ఆముదాల మురళి, అవధాని సాహితీ వేత్త విజయకుమార్, కవి రచయిత తిరువాయిపాటి చక్రపాణి, గాడిచెర్ల ఫౌండేషన్ సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖరకల్కూర, తెలుగుభాషా వికాసోద్యమం కార్యదర్శి జెఎస్ఆర్‌కె.శర్మ, ప్రొఫెసర్ డాక్టర్ మల్లిపూడి రవిచంద్ర, రచయిత్రి డాక్టర్ ఎన్.శాంతమ్మ, తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఆశావాది కుమారుడు సంస్కృతోపన్యాసకులు డాక్టర్ ఆశావాది సుధామవంశి, యువ అష్టావధాని బోరెళ్ల హర్ష, శిష్యులు లక్ష్మీమానస పాల్గొన్నారు. శతావధాని ఆముదాల మురళి మాట్లాడుతూ ఆశావాది ప్రకాశరావు తనలోని అవధానిని మేల్కొలిపారన్నారు. ఆయన నుంచి తెలుగు భాషలోని సందర్భోచిన పదప్రయోగాలను నేర్చుకున్నామన్నారు. అవధాన విద్య వికాస పరిషత్తు ఏర్పాటు చేసి పద్య రచన, అవధానంపై ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మే 8 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఆశావాది స్ఫూర్తితో నేను ఇప్పటి వరకు 205 అష్టావధానాలు, నాలుగు శతావధానాలు , ద్విగుణీకృత అవధానాలు చేశామన్నారు. సివి సుబ్బన్న నుంచి ఆశావాది ప్రకాశరావు ఆయన నుంచి తాను ఈ పరంపరను కొనసాగిస్తున్నామన్నారు. నాకు గొప్ప ప్రపంచాన్ని ఆశావాది పరిచయం చేశారు. భవిష్యత్తు తరాలు కూడా ఈ ఒరవడిని ఆయన ఆశయానికి భంగం కలగకుండా కొనసాగేలా ఆశావాది సాహితీ కుటుంబం , శిష్య బృందం ద్వారా నిర్వహిస్తామనే శపథం చేస్తున్నామని అన్నారు. డాక్టర్ పల్లిపూడి రవిచంద్ర మాట్లాడుతూ ఆశావాది ప్రకాశరావుది మేరుశిఖరం లాంటి వ్యక్తిత్వం, చాలా గొప్పగా పద్యాలు రాస్తారన్నారు. నన్నయ గురించి ఆయన రాసిన పద్యాన్ని చదివి వినిపించారు. నన్నయ కవిత్వానికి ఎన్ని ఏళ్ళ గడిచినా ప్రభావం తగ్గలేదని ఆశావాది చెప్పారన్నారు. నన్నయకు, తిక్కనకు లేని శిష్యులు ఆశావాదికి ఉన్నారన్నారు. శిష్యుల గొపదనాన్ని విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. అన్నమరాజు ప్రభాకరరావు రచించిన పరిశోధనా గ్రంథం ఆశావాది విబుధారాధన గ్రంథ పరిచియం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆయనకు సాహిత్య అధ్యయనం పట్ల గొప్పశ్రద్ధ ఉండేదన్నారు. ఆనేక విషయాలను ఆయన నుంచి నేర్చుకున్నారు. ఆయనతో ఉండే అనుబంధాన్ని వివరించారు. జెఎస్ఆర్‌కె శర్మ ఆశావాది జీవిత విశేషాలను వివరించారు. డాక్టర్ సుధామవంశి మాట్లాడుతూ తండ్రితో ఉన్న అనుబంధాన్ని , అవధానిగా ఆశావాది చేసిన కృషిని వివరించారు. ఆశావాది సాహితీ కుటుంబం చాలా గొప్పదని వివరించారు. మానాన్నగారి గురువు నండూరి రామకృష్ణమాచార్యులు, ఆయన కుమారుడు నందూరు విద్యార్ణ్యతో సంబంధాలున్నాయని అన్నారు. రచయిత్రి చంద్రమౌళిని మాట్లాడుతూ ఆశావాది ప్రకాశరావు గురించి శాంతమ్మ సందేశాన్ని చదివి వినిపించారు. అంతకు ముందు అధ్యాపకులు డాక్టర్ బాసెట్టి లత అతిథులను పరిచయం చేశారు.

సభలో మాట్లాడుతున్న అన్నమరాజు ప్రభాకరరావు

పోరాహోరీగా సాగుతున్న పోటీలు

పోటాపోటీగా అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండలో మూగి తాత ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక వాలీబాల్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు రెండవ రోజు ఆదివారం పోటాపోటీగా సాగాయి. మంగళూరు- కర్నూలు, బసాపురం రాజు- వీరేష్, కిట్టు- దస్తగిరి టీములు మధ్య రసవత్తరంగా పోటీలు జరిగాయి. సోమవారం ఫలితాలు వెలువడతాయని కమిటీ సభ్యులు తెలిపారు. వాలీబాల్ పోటీలను తిలకించడానికి యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని గుల్ హుస్సేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని ట్రస్టు అధ్యక్షుడు మజహర్ అహ్మద్, చైర్మన్ తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మజహర్ అహ్మద్ మాట్లాడుతూ రోగులకు ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా గుండె సంబంధిత వైద్యులు వినోద్ కుమార్, గైనకాలజిస్ట్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో రోగులకు బిపి, షుగర్ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశామని తెలిపారు. కులమతాలకతీతంగా ఉచితంగా వైద్యం అందించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి నెల నిర్వహించే ఉచిత క్యాంపులో పలు రకాల వైద్యులందరూ అందుబాటులో ఉంటారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత క్యాంపుకు సహకరించిన మధు ఆసుపత్రి సిబ్బందికి ట్రస్టు తరపున కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు సయ్యద్ నఫీస్ పాష, ఆర్టీఓ ఏజెంట్ మస్తాన్, కార్యదర్శి గుల్జార్ అహ్మద్, ట్రెజరర్ ఫిరోజ్, సభ్యులు అల్తాఫ్, షేర్ ఖాన్, రియాజ్, మహమ్మద్ తాజ్, ఖలీద్, అమానుల్లా, షఫీ, కలీం అహ్మద్, యంఎఫ్ఎస్ మెడికల్ ప్రొప్రైటర్ ఫరీద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం కక్ష సాధింపు : జెఎస్‌పి

ప్రజాశక్తి - ఆదోని

సామాన్యులపై వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, తిరుగుబడే రోజులు దగ్గర్లో ఉన్నాయని ఆదోని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మల్లప్ప మండిపడ్డారు. ఆదివారం జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటం గ్రామంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకునేందుకు స్థలం ఇచ్చారన్న కారణంగా అక్కడ పేదల ఇళ్ళను కూలగొట్టి కక్షసాధింపు చర్యలకు వైసీపీ ప్రభుత్వం దిగిందని మల్లప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదోని పట్టణంలో అధిక జనాభా ఉన్న రోడ్ల విస్తరణ రూ 50 కోట్లు నిధులు ఇస్తామని సీఎం జగన్ బహిరంగంగా ప్రకటన చేసి నెలలు దాటినా కార్యరూపం దాల్చలేదన్నారు. అలాంటిది ఇప్పటం అనే చిన్న గ్రామంలో జనాభా తక్కువ ఉన్నప్పటికీ 120 అడుగుల రోడ్లు వేసేందుకు ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చేందుకు కంకణం కట్టుకోవడం చూస్తుంటే అర్థమవుతుందన్నారు. బ్రిటిష్ వాళ్ళు ఏర్పాటు చేసిన హద్దు రాళ్ల లోపలే గృహాలు కట్టుకున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం అక్రమంగా పేదల ఇళ్ళను కూల్చుతోందని, పేదల ఉసురు వైసీపీ ప్రభుత్వానికి కచ్చితంగా తగులుతుందన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు రాజశేఖర్, రవి వర్మ, తాహెర్ వలి ఉన్నారు.

తీరుబజారులో ఉచిత వైద్య శిబిరం

హొళగుంద : మండల కేంద్రంలోని స్థానిక తీరుబజారులో ఉచిత వైద్య శిబిరంను ఆదివారం నిర్వహించారు. సిరుగుప్ప న్యూ లైఫ్ పిల్లల వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, మహిళా వైద్యులు డాక్టర్ అమీనా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రతి తల్లిదండ్రులు ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు. మహిళా వైద్యులు డాక్టర్ అమీనా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, మహిళలు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని అన్నారు. వైద్య శిబిరంలో మౌళి సాబ్, సమీయుల్లా, జమాతి ఆలేదీస్, మత పెద్దలు హాజీ అబ్దుల్లా, అజీమ్ సాబ్, రఫిక్, సబ్ఈసా హమీద్, అమీన్, అబ్దుల్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్‌కు ఎన్నికల్లో పరీక్ష ?

చోద్యం చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ ఎన్నికల్లో పరీక్ష ఎదుర్కొంటున్నారు. మేమున్నామంటూ ధైర్యం చెప్పాల్సిన పెద్దలు చోద్యం చూస్తున్నారన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార వైసిపికి 95 శాతం ఓట్లు ఉన్నా కూడా ఎన్నికలు నిర్వహిస్తుండంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 13న జరగాల్సిన ఎన్నికలు ఏకగ్రీం చేయాలని వైసిపి అధిష్టానం జిల్లా పార్టీ పెద్దలు ఎంత ప్రయత్నం చేసినా వారి ప్లాన్ రివర్స్ అయ్యిన్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ ఏర్పడంతో ఈ పోటీ డాక్టర్ మధుసూదన్ పైన లేక వైసిపి అధిష్టానం పైన అని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. జిల్లాలోని ఎంపీటీసీ, జడ్పిటిసి, కౌన్సిలర్ స్థానాలు 95 శాతం వైసిపి తరపున విజయం సాధించి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా 1178 మంది ప్రజా ప్రతినిధులు ఉండగా వైసిపి తరపున 95 శాతం ప్రజాప్రతినిధులు 1022 మంది, మిగిలిన వారు టిడిపి బిజెపి ఇతర పార్టీల ప్రజా ప్రతినిధులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 95 శాతం వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉండడం వల్ల ఎలాగైనా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని గెలిపించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవాలని అధికార పార్టీకి చెందిన ప్రధాన నాయకులు ఆశ పెట్టుకుని ఉన్నారు. అయితే వారి ఆశలను అడియాశలు చేస్తూ వైసిపి అధిష్టానం బోయ సామాజిక వర్గానికి చెందిన ఆదోని నివాసి డాక్టర్ మధుసూదన్‌ను కర్నూలు ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకించలేక వైసిపి ప్రధాన నాయకులు సంఘం నాయకులను ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో నిలిపారని పలువురు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ ఏర్పడడంతో ఫలితం ఎలా ఉంటుందోనని అందరూ చర్చించుకుంటున్నారు. వైసిపి అధిష్టానంపై, ప్రభుత్వంపై, వాలంటరీ వ్యవస్థ వల్ల తమకు ఎలాంటి ప్రాతినిధ్యం లేకుండా పోయిందని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు అసంతృప్తి ఉన్నారని ఎన్నికల్లో ఏమైనా వ్యతిరేకం చూపిస్తారేమేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బయటపడుతున్న విభేదాలు : వైసిపి అధిష్టానం బీసీలు అంటే కేవలం వాల్మీకి లేనని వారికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని బీసీల్లోని ఇతర వర్గాలైన యాదవులు, కురవలు తదితర నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వాల్మీకి బోయ వర్గానికి చెందిన వారికి జిల్లా గ్రంథాలయం చైర్మన్ గా కర్నూలు మేయర్గా ఆదోని మున్సిపల్ చైర్మన్‌గా ఎంపిక చేశారని మరల అదే వర్గానికి కేటాయించడంపై ఇతర బీసీ వర్గాలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. స్థానిక సంస్థల్లో అధిక శాతం బీసీలే ప్రాతినిధ్యం వహిస్తుండడం వల్ల ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయని అందరూ చర్చించుకుంటున్నారు. ఇటీవల ఆదోనిలో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటు చేసిన కౌన్సిలర్ల సమావేశంలో యాదవ వర్గానికి చెందిన రాష్ట్ర నాయకులు రమేష్ యాదవ్ ఇదే విషయాన్ని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి దృష్టికి సమావేశంలోనే తీసుకెళ్లారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే కూడా బుజ్జగించినట్లు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. డాక్టర్ మధుసూదన్‌ను ఎమ్మెల్సీగా ఎన్నిక చేయడంలో ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్ని విధాలుగా అండగా ఉండి నామినేషన్ కార్యక్రమం లోనూ, నామినేషన్ల ఉపసంహరణ కోసం తనవంతుగా ఎంతో కృషి చేశారని అయినా ఫలించలేదని ఆదోని నియోజకవర్గం వైకాపా నాయకులు పేర్కొంటు న్నారు. అసంతృప్తితో క్రాస్ ఓటింగ్ ఎక్కడ జరుకుతుందోనని వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ వర్గంలో ఆందోళన వ్యక్తం అవుతుంది.

14 ఏళ్ల తర్వాతనైనా చట్టసభలకు మధుసూదన్ వెళ్లేనా..

ఆంధ్రప్రదేశ్ చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం 14 ఏళ్ల తర్వాత తిరిగి డాక్టర్ మధుసూదన్‌కు దక్కింది. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 2009లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల గాను డాక్టర్ మధు సుదన్ ను అప్పట్లో కొత్తగా ఏర్పడిన మంత్రాలయం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రకటించారు. అయితే అప్పట్లో కొన్ని అనివార్య కారణాలవల్ల ఆ అవకాశం డాక్టర్ మధుసూదన్‌కు చేజారింది. తిరిగి ముఖ్యమంత్రి వైసిపి అధినేత జగన్మో హన్ రెడ్డి ద్వారా డాక్టర్ మధుసూదన్‌కు దక్కింది. పోలింగ్ తర్వాత ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు : ప్రచార కరపత్రాలను చూపిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, బీసీ సంఘాలు, మాలమహానాడు సంఘాల నాయకులు స్థానిక తేరుబజారునందుగల ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశంలో పాల్గొని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు బి. రామాంజనేయులు, మాల మహానాడు నాయకులు నరసన్న, బీసీ సంఘం నాయకులు డాక్టర్ కే. గణేష్, రామచంద్ర, ఐఎఫ్టియు నాయకులు అనీఫ్, వృత్తిసంఘాల జిల్లా నాయకులు పి. గోవిందు మాట్లాడుతూ ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు ఆలోచన చేసి మంచి నాయకున్ని ఎన్నుకోవలసిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత, ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులు అధికారం ఆత్మ గౌరవం కోసం పోరాడే వారికే తమ అమూల్యమైన ఓటు ఇవ్వాలని కోరారు. సిపిఎస్ రద్దు కోసం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్ స్కేలు సాధన కొరకు, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, పెన్షనర్ల సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే ప్రస్తుత పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాడుతున్నారని తెలిపారు. రాయలసీమ అభివద్ధికి ,రాయలసీమలో వ్యవసాయ పరిశ్రమల అభివద్ధికి నిరంతరం పోరాడే పోతుల నాగరాజు గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించడానికి కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హనుమంతు, సిఐటియు నాయకులు రాముడు, ఐ.ఎఫ్. టి.యు.నాయకులు ప్రసాదు, ఎస్ఎఫ్ఐ నాయకులు రంగన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల** : ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు అన్నారు. యుటిఎఫ్ కెవిపిఎస్, జనసేన, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు హెచ్ కైరవాడి, కులుమాల, అలువాల, వేముగోడు, పుట్టపాసం గ్రామాలలో పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో జనసేన నాయకులు గానిగ బాష, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యస్ నరసింహులు, మండల అధ్యక్షులు రామన్, నాయకులు జిక్రియ,జి నరసింహులు కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి కరుణాకర్,ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మునిస్వామి, కెవిపిఎస్ జిల్లా యువజన నాయకులు ప్రదీప్,ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వీరన్న, మండల అధ్యక్షులు ఖాజా, నాయకులు ఉదయ్ కెవిపియస్ నాయకులు రాజేష్, కాలేబు, అంజినయ్య,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **పెద్దకడబూరు :** పాలకులను శాసనమండలిలో నిలదీసి ప్రజా సమస్యలపై పోరాడే వారికే ఓటేయండి అని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈ. తిక్కన్న కోరారు. కర్నూలు జిల్లా పెద్దకడబూర్ మండల పరిధిలోని గంగులపాడు, రాగిమన్ దొడ్డి గ్రామాల్లో శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజుకి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమలో ఇప్పటికే అలాగే జనసేన పార్టీ, కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించారని ఇవి కాకుండా రెండు వందలకు పైగా సంఘాలు మద్దతు ప్రకటించాయాని తెలిపారు. నిరుద్యోగులు ఆలోచించి పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయడానికి బ్యాలెట్ నందు వరుస నెంబర్ 27 వచ్చిందని తెలిపారు.

గోనెగండ్ల లో ప్రచారం నిర్వహిస్తున్న కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యండి ఆనంద్ బాబు, కెవిపిఎస్ నాయకులు

కోసిగి రూరల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. మండల కేంద్రంలోని 6వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె.రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి కె.వీరేష్ మాట్లాడారు. సామాజిక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న పోతుల నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, విద్యార్థి నాయకునిగా, సామాజిక కార్యకర్తగా, వెనుకబడిన కులాల ఐక్యవేదిక నాయకులుగా, మహాత్మ పూలే ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులుగా పని చేశారని గుర్తు చేశారు. రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. **ఆదోని:** ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, ప్రజా సమస్యలను చట్టసభల్లో పరిష్కార దిశగా ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు కోరారు. ఆదివారం ఆదోని పట్టణంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధా న్యత ఓటు వేయాలని న్యూ చైతన్య కాలనీ, భాస్కర్ రెడ్డి కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిఐటియు, డివైఎఫ్ఐ, రైతు సం ఘం నాయకులు లక్ష్మణ్ తిప్పన గోపాల్ వీరేష్ వీరన్న మల్లికార్జున, తదితరులు ఉన్నారు.

ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్‌లు స్వాధీనం

- ఎస్ ఐ కిరణ్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

బిల్లులు లేని 9 ల్యాప్టాప్‌లను సెల్‌ఫోన్‌లకు సంబంధించిన 660 టచ్ స్క్రీన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ కిరణ్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఆదివారం ఉదయం 10:00 గంటల సమయంలో దిబ్బన దొడ్డి గ్రామ పరిధిలోని కురువ వీరా రెడ్డి మిరప పొలంలో తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన ఇబ్రహీం షాహిద్ ఇమామ్, ముంబై రాష్ట్రానికి చెందిన మొహమ్మద్ ఫరాజ్, జావిద్ అన్సారి అను ముగ్గురు వ్యక్తులు బాక్సులను తరలిస్తుండగా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ఎలాంటి బిల్లులు లేకుండా హెచ్పీ కంపెనీకి చెందిన తొమ్మిది లాప్టాప్ లను మరియు సెల్ఫోన్లకు సంబంధించిన టచ్ స్క్రీన్ లను 66 బాక్స్ లు (ఒక్కొక్క బాక్స్ లో 10 చొప్పున మొత్తం 660 టచ్ (స్క్రీన్లు) తీసుకొని పోతుండగా పట్టుకొన్నామని పేర్కొన్నారు. ఏలాంటి బిల్స్ లేని కారణంగా తదుపరి చర్యల నిమిత్తం ఆదోని సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ వారికి అప్పగించటం జరిగిందని తెలిపారు.

సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను చూపిస్తున్న

తెలుగు తమ్ముళ్ల వర్గ విభేదాలు..

ప్రజాశక్తి - నందవరం

అసెంబ్లీ ఎన్నికల దగ్గర పడుతున్న కొద్ది పార్టీ గెలుపుకై పోరాడాల్సిన తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు ఎత్తులు వేసుకుంటూ వర్గ విభేదాలు సృష్టించుకుంటున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో వర్గవిభేదాలు మరోసారి పైకి తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా నందవరం మండలంలో టిడిపికి కంచుకోటలాంటి పెద్ద గ్రామాల్లో వర్గపోరు తార స్థాయికి చేరింది. నందవరంలో దేశాయ్ మాధవ రావు, నాగరాజు గౌడ్ ల మధ్య వర్గాలు ఉండేవి. అయితే 2019 ఎన్నికల తర్వాత నాగరాజు గౌడ్ ఆయన భార్య మాజీ జడ్పి వైస్ చైర్మన్ పుష్పవతి బివిజెతో మనస్పర్థలు రావడంతో టిడిపి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మాధవరావు దేశాయ్ మాచాపురం గ్రామ సమస్యలో తల దూర్చాడని ఓ క్లస్టర్ ఇంచార్జ్ నందవరంలోని నాగరాజు గౌడ్ ముఖ్య అనుచరులైన మస్తాన్, బోయ వీరేష్, వడ్డే గోపాల్ ను మాజీ ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి దగ్గరకు తీసుకువెళ్లి మరోసారి వర్గ విభేదాలకు ఆజ్యం పోసారని, నందవరంలోనే ఓ యువ నాయకుడిని కూడా మాధవ రావు దేశాయ్‌కి పోటీగా తీసుకొచ్చేందుకు ఆయన విశ్వ ప్రయత్నం చేస్తున్నారని మాధవ రావు వర్గం ఆరోపిస్తుంది. హాలహర్వి గ్రామంలో కూడా రైస్ మిల్ నారాయణరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి వర్గాల మధ్య తార స్థాయికి వర్గబేధాలు చేరాయి. గ్రామంలో ఇదేం కర్మ నిర్వహిస్తున్న ఒక వర్గంపై మరో వర్గం నాయకులు ఆరోపణలు చేస్తూ టిడిపి కార్యకర్తలను, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని రైస్ మిల్ నారాయణ రెడ్డి వర్గం ఆరోపణ కుప్పిస్తున్నారు. కనకవీడు రఘుమూర్తి స్వామి, డబ్బా ఈరన్న వర్గాలు గ్రామస్థాయి నాయకుడు మా నాయకుడే అంటే మా నాయకుడు అంటూ వర్గ విభేదాలు సృష్టించుకుంటున్నారు. దీంతో అక్కడ వర్గ విభేదాలు తార స్థాయికి చేరాయి. టీ.సోమాలగుడూరు గ్రామంలో వెంకటరామిరెడ్డి, పార్థసారథి రెడ్డి వర్గాల మధ్య ఎప్పటి నుండో వర్గ విభేదాలు ఉన్నాయి. పార్థసారథి రెడ్డి టిడిపిలోకి రావడంతో పార్టీలో మరోసారి వర్గ విభేదాలు బయటపడ్డాయి. అప్పటి నుండి గ్రామంలో రెండు వర్గాలు ఆధిపత్యం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. వర్గ పోరుతో సునాయాసనంగా గెలవాల్సిన ఎన్నికల్లో టిడిపి ఘోరంగా ఓడిపోయింది. నది కైరవాడి గ్రామంలో కూడా ఐటిడీపీ వీరేష్, వీరారెడ్డి వర్గాల మధ్య గత పంచాయతీ ఎన్నికల నుండి వర్గ విభేదాలు మొదలయ్యాయి. ఒకరినొకరు ఆధిపత్యం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దకొత్తిలి పంచాయతీలో కూడా సీనియర్, జూనియర్ నాయకులు మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరడంతో గత పంచాయతీ ఎన్నికల్లో గజేంద్ర రెడ్డి ఓటమిపాలైనట్లు ఆయన వర్గం ఆరోపిస్తోంది. గురజాల, ఇబ్రహీంపురం గ్రామాల్లో వర్గ బేధాలు ఉన్నట్లు టిడిపి కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. 15నెలలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో లోపు వర్గ విభేదాలు తారాస్థాయి చేరి, పార్టీకి భారీ నష్టం కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మేధావులు అంటున్నారు.

పట్టుపడితే పాయింట్లే

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రైతుబిడ్డ నందిని ప్రతిభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన కర్నూలు జట్టులో నందిని

గోనెగండ్ల గ్రామానికి చెందిన కె నందిని ఆరేకల్ మహాత్మ జ్యోతిబాపూలే వెల్ఫేర్ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. పాఠశాలకు సెలవులు వచ్చినప్పుడు సొంత ఊరు గోనెగండ్లలో తమ తల్లిదండ్రులతో పొలానికి వెళ్లి వ్యవసాయ పనుల్లో సహాయపడుతుంది. చదువు వ్యవసాయ పనులే కాకుండా పాఠశాల ప్రిన్సిపల్ యమునా దేవి ప్రోత్సాహం పిఈటి కె ఎల్లమ్మ సహకారంతో కబడ్డీ ఆడుతూ బాలికల జట్టు కోచ్ రామన్న మేనేజర్ హరితల ద్వారా మెలకువలు నేర్చుకొని కబడ్డీ ఆటలో అండర్ - 14 విభాగంలో రాణిస్తూ లెఫ్ట్ కార్నర్ క్రీడాకారిణిగా డిఫెండింగ్‌లో ప్రతిభ చూపుతూ నందిని పట్టుపడితే పాయింట్లు రావాలసిందే అన్న చందంగా రాణిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటుంది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రమైన గోనెగండ్లకు చెందిన కోతి రాళ్ల గొల్ల వీరన్న ఉమామహేశ్వరి దంపతులది రైతు కుటుంబం. వీరికి నలుగురు కుమార్తెలు ఒక కుమారుడు. రెండవ కుమార్తె కె నందిని గోనెగండ్లలోని మండల పరిషత్ బస్టాండ్ ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి వరకు చదువుకొని తర్వాత ఆరేకల్ మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో ఐదవ తరగతిలో చేరింది. నందిని ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. చదువుకుంటూనే పాఠశాల సెలవు రోజుల్లో గ్రామానికి వచ్చి వ్యవసాయ కుటుంబమైన తమ తల్లిదండ్రులకు పొలం పనుల్లో సాయం చేస్తుంది. మరోపక్క పాఠశాల పిఈటి ఎల్లమ్మ సహకారంతో కబడ్డీ క్రీడలో రాణిస్తూ ఆదోని మండల స్థాయిలో రాణించి జిల్లాస్థాయికి ఎంపికయింది. కర్నూలు స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ -14 బాలికల కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఆదోనిలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో కబడ్డీ కోచ్ రామన్న మేనేజర్ హరిత మెలకువలతో మెరుగులు దిద్దుకుని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి1వరకు చిత్తూరు జిల్లా నగరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ - 14 బాలికల కబడ్డీ ప్రధాన జట్టులో లెఫ్ట్ కార్నర్ క్రీడాకారిణిగా ఆడుతూ డిఫెండింగ్‌లో రాణించి కర్నూలు జట్టు విజయానికి దోహదం చేసి తన ప్రతిభతో జాతీయ స్థాయికి ఎంపికైంది. విద్యార్థినిగా చదువుకుంటూనే సమయం దొరికినప్పుడు తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తూ మరో పక్కకబడ్డీ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికైన రైతుబిడ్డ కె నందినిని పాఠశాల ప్రిన్సిపల్,సిబ్బందితో పాటు గోనెగండ్ల గ్రామస్తులు జాతీయ స్థాయిలో కూడా రానించి మరెన్నో పురస్కారాలు అందుకోవాలని అభినందనలు తెలుపుతున్నారు.

షాహి జామియా మసీదు పాలక మండలికి

ఎన్నికలు జరపాల్సిందే

- నిద్రమత్తులో వర్ఫ్ బోర్డు అధికారులు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మైనార్టీలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని షాహి జామియా మసీదు దక్షిణ భారతదేశంలోని పేరెన్నిక మసీదుల్లో ఒకటి. షాహి జామియా మసీదును సిద్ధిమసూద్ ఖాన్ నిర్మించారు. 21 మార్చి 1921న మొట్టమొదటి సారిగా షాహి జామియా మసీదుకు ఎన్నికలు నిర్వహించారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఐదేళ్లకు ఒక్కసారి ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. 2014లో డబ్ల్యూపి నెం.336/2014 ద్వారా హైకోర్టు వర్ఫ్ బోర్డుకు షాహి జామియా మసీదుకు ఎన్నికలు జరపాలంటూ ఆదేశాలు జారీ చేసింది. 03 మే 2015న వర్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో మసీదుకు ఎన్నికలు జరిగాయి. 04 మే 2015న ఫలితాలు వెలుబడ్డాయి. ఈ ఎన్నికల్లో గుబ్రి రఫూఫ్, షాషావలి, సయ్యద్ జావిద్ అన్వర్, కల్నల్ రహంతుల్లా, మస్తాన్ వలి ముతవల్లిలుగా గెలుపొందారు. అయితే ఈ ఎన్నికలు ఆదోని షాహి జామియా మసీదు బైలాస్ ప్రకారం, కోర్టు నిర్ణయించిన విధానంలో ఎన్నికలు జరగలేదంటూ పూర్వ ముతవల్లిలు కె ఎజాజ్ అహ్మద్, ఆర్ సలావుద్దీన్లు కోర్టు దిక్కరణ కింద వర్ఫ్ బోర్డు అధికారులపై సీసీనెం.947/2015 కింద కేసు వేశారు. దీన్ని విచారించిన ధర్మాసనం గతంలో జరిగిన ఎన్నికలు బైలాస్ ప్రకారం జరగకపోవడంతో కొత్తగా ఎన్నికలు జరపాలని వర్ఫ్ బోర్డు అధికారులను ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ అప్పటి ట్రస్టీ కల్నల్ రహంతుల్లా డబ్ల్యూపి నెం. 1338/2016న కేసు వేశారు. దీన్ని కూడా విచారించిన ధర్మాసనం ఈ కేసును కొట్టివేస్తూ వక్స్ బోర్డు లా ఆఫీసర్ పర్యవేక్షణలో ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా ఐదేళ్లు దాటినా ఇప్పటి వరకు ఎన్నికలు జరపకుండా వర్ఫ్ బోర్డు నిద్రమత్తులో ఉంది. ఇటీవల కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ఆదోని షాహి జామియా మసీదులో పర్యటించినప్పుడు ఆయన మాట్లాడుతూ మసీదుల్లో రాజకీయాలు మాని నిస్వార్థ సేవ చేయాలని చెప్పారని పలువురు గుర్తు చేశారు. అయినా కూడా మసీదుల్లో రాజకీయాలు షరా మాములుగా మారాయని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఆదోని షాహి జామీయా మసీదు చరిత్ర మసకబారుతోందని ప్రతిష్ట పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పలువురు కోరుతున్నారు.

ఎన్నికలు జరపాల్సిందే : హుస్సేన్ సాని, న్యాయవాది

షాహి జామీయా మసీదు ఎన్నికలు జరగాల్సిందే. ఇక్కడ రాజకీయాలు కాదు సేవ చేయాలి. ప్రస్తుత ముతవల్లీల కాల వ్యవధి ముగిసింది. 2020లో జరగాల్సిన ఎన్నికలు ఇప్పటి దాకా ఎందుకు జరగలేదు. బైలాస్ ప్రకారం ప్రతి ఐదేళ్లకొకసారి ఎన్నికలు జరగాలి. వక్ఫ్ బోర్డు అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

పాలకవర్గం రద్దు అయింది

- కెఎం జుబేర్ అహ్మద్, పూర్వ ఎగ్జిక్యూటివ్ ట్రస్టి

2015లో బైలాస్ ప్రకారం ఎన్నికలు జరగలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించాను. హైకోర్టు ఈ ఎన్నికలను 2016లో రద్దు చేసింది. దీంతో వర్ఫ్ బోర్డు అధికారులు వచ్చి అన్ని పనులు పూర్తి చేశారు. అయితే ఇప్పటి వరకూ ఎన్నికలు జరగలేదు. ఇప్పుడున్న ముతవల్లిల్లో ముగ్గురు చనిపోయారు. ఇద్దరు మాత్రమే ఉన్నారు. అయినా కూడా ప్రస్తుతం ఉన్న ఇద్దరు ముతవల్లిలు అనధికారికంగా కొనసాగుతున్నారు. షాహి జామియా మసీదుకు నెలకు సుమారు రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తోంది. అకౌంట్లు లేకుండా దుర్వినియోగం జరిగే అవకాశం ఉందని ఆరోపించారు. వక్స్ బోర్డు అధికారులు కూడా వీరితో చేతులు కలిపారన్న అనుమానం కలుగుతోంది.

వాళ్లకు అధికారం లేదు

- దర్వాడ్ రసూల్ సాబ్, టెనెంట్

అనేక ఏళ్లుగా షాహి జామియా మసీదుకు చెందిన అంగడిలో బాడుగకు ఉంటున్నాను. జామీయా మసీదుకు చెందిన అంగళ్లలో 650 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. 210 మంది టెనెంట్స్ ఉన్నారు. ప్రస్తుతం ఉన్న ముతవల్లిల పదవి కాలం ముగిపింది. షాహి జామీయా మసీదు కమిటి బైలాస్ ప్రకారం ఏమీ చేయాలన్న ఐదు మంది ముతవల్లిలు మెజార్టీ నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే అది చెల్లుబాటు అవుతుంది. రద్దయిన పాలక వర్గం 33 శాతం బాడుగలు పెంచుతామని చెబుతున్నారు. మొదట ఎన్నికలు నిర్వహించి తరువాత బాడుగలు పెంచండని మేమంటున్నాం.

స్టే రద్దయినట్లు ఉంది

- అబ్దుల్ ఖదీర్ సాబ్, చిప్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆంధ్రప్రదేశ్ స్టే రద్దు అయినట్లు ఉంది. పూర్తి స్థాయిలో విచారణ చేసి త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తాం. రెండేళ్ల నుంచి దీనిజోలికి వెళ్లలేదు. త్వరలో హైకోర్టును సంప్రదించి ఎన్నికలు పూర్తయ్యేలా చర్యలు చేపడుతాం.

వైభవంగా మూగితాత ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండలో ఆదివారం మూగి తాత ఉరుసు ఉత్సవాలు దర్గా కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఆలూరు టిడిపి ఇన్చార్జ్ కోట్ల సుజాతమ్మ స్వామివారి దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొని పూజలు నిర్వహించి ముడుపులను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఈదుల దేవరబండ సుభాన్, బడిగింజల రంగన్న, రామారావు నాయుడు, మాలిక్ భాషా, మల్లికార్జున గౌడ్, వెంకట స్వామి గౌడ్, మల్లయ్య, బండ్లయ్య, రాజాసాబ్, సుభాన్, మస్తాన్, పెద్దయ్య పాల్గొన్నారు.

IN THE COURT OF THE VII ADDL.
DISTRICT JUDGE : CUM : MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL :: KURNOOL
M.V.O.P.NO. 159/2022.

V.Suresh. …Petitioner.

-Vs-

1. N.Udaya Kumar.
2. HDFC ERGO General Insurance Co. Ltd.
3. B.Ramakrishna. …Respondents.

Respondent No3

3.B. Ramakrishna, S/o B. Anantha Rao, Major, Driver of the Vehicle, R/o.Edify World School, Dupadu Village, Kurnool Mandal and Dist.518002.

Where as the petitioners has filed said case against you for compensation under M.V. Act. If you have any objections for the same may appear either in person or through advocate on 06-03-2023 at 10-30 A.M. before the said court, failing which the matter will be decided in your absence.

Sri.M.L.Srinivasar eddy,
Advocate for petitioner,
Cell No.9440290266
Kurnool Dist. A.P.

గెలుపు కోసం ఏమైనా చేద్దాం..!

- అధికార పార్టీ కుటిల యత్నాలు
- చివరికి బెదిరింపులకూ సిద్ధం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు ఎంత వరకైనా సిద్ధపడుతున్నారు. కుటిల యత్నాలతో ఎలాగైనా నెగ్గాలని చూస్తున్నారు. చివరికి బెదిరింపులకు కూడా సిద్ధమవుతున్నారు....

అధికార పక్ష వైసిపి నాయకులు పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులు ఓడిపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత బయటపడుతుందని భావిస్తున్నారు. దీంతో తమ అభ్యర్థుల గెలుపు కోసం కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు రోజుల కిందట విద్యాశాఖ అధికారులు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలకు ఫోన్లు చేశారు. ఎలాగైనా వైసిపి అభ్యర్థులకే ఓట్లు వేయాలని, లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇటీవల అధికార పార్టీ నాయకులు నంద్యాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా తమ పట్టభద్రుల అభ్యర్థికే ఓటు వేయాలని ఒక

రిటైర్డ్ ఇంజనీరును కోరారు. దాంతో ఆయన తనకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తానని చెప్పడంతో ఆయనపై ప్రచారానికి వెళ్లిన వారు దాడి చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు సదరు వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఫిర్యాదు తీసుకోకుండా అధికార పార్టీ వారితో ఎందుకు పెట్టుకుంటారు అంటూ చెప్పి పంపడం గమనార్హం. ఇలా అధికార పార్టీ నాయకులు తమ పార్టీ అభ్యర్థులకే ఓటు వేయించడానికి దాడి చేయడానికి కూడా వెనకాడటం లేదు. ఇటీవల విద్యాశాఖాధికారులు నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పైకి అధికారిక సమావేశంలాగా కనిపించినా వైసిపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించడం కోసమే ఆ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. వీటితో పాటు ప్రచారంలో పాల్గొన్నారన్న కారణంతో ఎపిటిఎఫ్ నాయకులు హృదయరాజుకు విద్యాశాఖ అధికారులు నోటీసులు అందజేశారు. పలు ప్రాంతాల్లో విద్యా శాఖ అధికారుల ద్వారా అధికార పార్టీ నాయకులు ఉపాధ్యాయ సంఘాల నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నారు. వైసిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని ఫోన్ చేసిన ఓ యువతికి ఎందుకు ఓటు వేయాలని, ప్రస్తుత అభ్యర్థి తండ్రి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పాలని సమాధానం ఇచ్చారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో వ్యతిరేకత వ్యక్తమవుతోందని గమనించిన అభ్యర్థి పట్టభద్రులకు నగదును పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఇప్పటికే జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు టిఫిన్ బాక్సులు పంపిణీ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇలా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడం కోసం అధికార పార్టీ నాయకులు చేస్తున్న పనులపై అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

- జెవివి, యుటిఎఫ్ నేతలు - ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - డోన్

పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ పోతుల నాగరాజుకి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖాజా, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడులు కోరారు. ఆదివారం డోన్ పట్టణం పాతపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులైన మేధావి వర్గం ఓటు వేసే ఈ ఎన్నికల్లో ప్రలోభాలకు గురి కాకుండా రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ పోతుల నాగరాజుకి 198 ప్రజా సంఘాలు మద్దతు పలుకుతున్నాయంటే ఆయన ఉద్యమ నేపథ్యం, పోరాట పటిమ తెలుస్తుందన్నారు. పోతుల నాగరాజు ఇప్పటికే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని కూడా స్వచ్ఛందంగా వదులుకొని జీవితాన్ని ఉద్యమాలకు అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. మేధావులను, ఉన్నత విద్యావంతులను పెద్దల సభకు పంపాల్సిన ఈ ఎన్నికలలో కూడా వైసిపి, టిడిపి, బిజెపిలు ప్రలోభాలతో డబ్బు మూటలతో గెలవాలని పోటీలు పడుతున్నాయని అన్నారు. అటువంటి వారిని గెలిపించినా వారి సొంత ప్రయోజనాల కోసం, హంగు ఆర్భాటాలు, హోదా కోసం చట్టసభలను ఉపయోగించుకుంటారు తప్ప ప్రజా సమస్యలపై ప్రశ్నించిన పాపానా పోవడం లేదన్నారు. వారిని గెలిపించినా ప్రజలకు ఒరిగేది ఏమీ ఉండదని స్పష్టం చేశారు. చట్టసభల్లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తప్పు, ఒప్పులను గ్రహించి ధైర్యంగా రాజకీయాలకు అతీతంగా చెప్పగలిగే స్థాయి ఉండాలని, అది రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. అటువంటి లక్షణాలన్నీ పిడిఎఫ్ అభ్యర్థులు నాగరాజుకి, కత్తి నరసింహారెడ్డికి ఉన్నాయని, విజ్ఞులైన ఓటర్లు వారిని చట్టసభలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివరాం, శ్రీకాంత్, రామాంజనేయులు, నాగరాజు, నాగమద్దయ్య, **(మిగతా 6లో..)**

మాట్లాడుతున్న ముఫ్తి ఖదీర్ మౌలానా, చిత్రంలో ఎంఎ.గఫూర్, వాహిద్ హుస్సేన్ తదితరులు

యువత సన్మార్గంలో నడవాలి

- ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు ముఫ్తి ఖదీర్ మౌలానా

ప్రజాశక్తి - నంద్యాల

యువత పెడధోరణి పట్టకుండా సన్మార్గంలో నడవాలని ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు ముఫ్తి ఖదీర్ మౌలానా పిలుపునిచ్చారు. ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు ముఫ్తి ఖదీర్ మౌలానా నంద్యాల జిల్లా మిల్లీ కౌన్సిల్ కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే, ఆవాజ్ కమిటీ వ్యవస్థాపకులు ఎంఎ గఫూర్, ప్రముఖ పారిశ్రామికవేత్త, మహేంద్ర గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ పార్ట్నర్ వాహిద్ హుస్సేన్‌లు ఉన్నారు. వీరికి మిల్లీ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి జిఎం గౌస్, సహాయ కార్యదర్శి ఉస్మాన్ భాష, పొలిటికల్ కార్యదర్శి మస్తాన్ ఖాన్‌లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఫ్తి ఖదీర్ మౌలానా మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మిల్లి కౌన్సిల్ చేయాల్సిన సేవా కార్యక్రమాలను, మిల్లి కౌన్సిల్ సభ్యుల పాత్రను తెలియజేశారు. యువత సన్మార్గంలో నడిచేలా, సేవా కార్యక్రమాల్లో వారి వంతు భాగస్వామ్యం ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే బెంగళూరుకు చెందిన ఫాల్కనీ యూనివర్సిటీ, ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ సంయుక్తంగా ఉచిత ఉన్నత విద్యను అందించేందుకు స్కాలర్షిప్ టెస్టులను కూడా నిర్వహిస్తున్నామని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గతేడాది కర్నూలు జిల్లాతో పాటు నంద్యాలలో కూడా స్కాలర్ షిప్ పరీక్ష ఏర్పాటు చేయగా అందులో నలుగురు విద్యార్థులు ఎంపికై నేడు విద్య, వసతిని ఉచితంగా పొందుతున్నారని పేర్కొన్నారు.

త్వరలో 'అమృత్ ఫేస్-2' పూర్తి

- నంద్యాల ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం
- ప్రజాశక్తితో పబ్లిక్ హెల్త్ డిఇఇ గంగాధర్ ముఖాముఖి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'నంద్యాల పట్టణ ప్రజల దాదార్తిని తీర్చడమే లక్ష్యంగా అమృత్ ఫేస్-2 పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి అయితే పట్టణానికి ఎలాంటి నీటి సమస్య ఉండదు. నంద్యాల పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెలుగోడు రిజర్వాయర్ నుండి నంద్యాల పట్టణానికి అమృత్ స్కీం ద్వారా పైపులైన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ పనులు పూర్తి అవుతాయి. నంద్యాల పట్టణానికి రోజుకు 300 నుండి 500 లక్షల లీటర్ల నీళ్లు అవసరమవుతాయి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా, విస్తరించిన కాలనీలకు కూడా నీటిని ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది' అని పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్ తెలిపారు. అమృత్ స్కీం-2 పనులపై ఆయన ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

అమృత్ స్కీం పనులు ఎప్పటి నుండి ప్రారంభమయ్యాయి..?

డిప్యూటీ ఇఇ గంగాధర్ : అమృత్ స్కీం పనులు 2016లో ప్రారంభమయ్యాయి. 2020కి మొదటి విడత పూర్తి అయింది. అదే పీరియడ్ పనులను ఫేస్-2 కింద టేకప్ చేసి పనులు చేపడుతున్నాము.

ఏడేళ్ల నుండి పనులు జరుగుతున్నాయి..? పనుల్లో జాప్యం జరుగుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. దీనిపై మీరేమంటారు..?

డిప్యూటీ ఇఇ గంగాధర్ : పనుల్లో జాప్యం వాస్తవమే.. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఆలస్యం జరుగుతుంది, స్లూవ్ వే నుండి చేయటం కోసం ఇరిగేషన్ అధికారుల నుండి అనుమతి తీసుకోకపోవడం వల్ల పనులు ముందుకు సాగలేదు. అందుకు సంబంధించిన ఫైలు సిఇకి పంపాం. అక్కడి నుండి సిడిఒకు ఫైల్ వెళ్ళింది. ఆగిపోయిన చోట పనులు చేస్తున్నాం.

ఈ పనులు ఎప్పటిలోగా పూర్తి అవుతాయి..?

డిప్యూటీ ఇఇ గంగాధర్ : ఫేస్-2 కింద జరుగుతున్న పనులు జూలై నాటికి పూర్తి చేస్తాం.. మెటీరియల్ కూడా సిద్ధంగా ఉంది. ఇంకా మూడు నెలలు పట్టే అవకాశం ఉంది. వెలుగోడు వద్ద కిలోమీటర్ మేర పైప్‌లైన్ పెండింగ్ ఉంది. పట్టణానికి రోజువారీగా మంచినీటిని ప్రజలకు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం..

అమృత్ స్కీంకు బడ్జెట్ లేకపోవడం వలనే పనులు జరగడం లేదని ఆరోపణ ఉంది... మీరేమంటారు..?

డిప్యూటీ ఇఇ గంగాధర్ : కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు పెండింగ్ ఉండడం వలన కూడా పనులు ముందుకు సాగకపోవడానికి కూడా ఓ కారణం. ఇప్పుడు ఆ సమస్య ఏమీ లేదు..నిధులు వచ్చాయి.

అమృత్ స్కీంకు ఎంత బడ్జెట్ కేటాయించారు..! అందులో కేంద్ర, రాష్ట్రం, మున్సిపాలిటీ వాటా ఎంత..?

డిప్యూటీ ఇఇ గంగాధర్ : అమృత్ స్కీం కింద నీటి సరఫరాకు పైప్‌లైన్ వేయడం కోసం రూ.137.34 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. కేంద్రం వాటా 30 శాతం, మున్సిపాలిటీ వాటా 40.27 శాతం, రాష్ట ప్రభుత్వం వాటా 15 శాతం ఇవ్వడం జరుగుతుంది.

కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు ఎంత మేరకు చెల్లించాల్సి ఉంది..?

డిప్యూటీ ఇఇ గంగాధర్ : కాంట్రాక్టర్లకు సంబంధించి బిల్లులు చేస్తున్నాం. నిధుల సమస్య లేదు. రూ.50 కోట్లు మున్సిపాలిటీకి వచ్చాయి. ఇప్పటికే రూ. 40 కోట్లు బిల్లులు చేశాం. ఇంకా రూ.7.50 కోట్లు బిల్లు చేయాల్సి ఉంది.

ట్రీట్‌మెంట్ ప్లాంట్ అంటున్నారు.. అది ఎలా..?

డిప్యూటీ ఇఇ గంగాధర్ : ప్రస్తుతం ఇంటర్ కనెక్షన్ పైపులైన్ పనులు పట్టణంలో జరుగుతున్నాయి.. పంప్ హౌస్ వద్ద ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా పట్టణంలో ఇంటర్ కనెక్షన్ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి.. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద మోటర్ వాటర్ కనెక్షన్స్ వర్క్స్, పైప్ లైన్లు, కనెక్షన్ వర్క్స్, కొత్త 30 ఎంఎల్‌టి ఫిల్టేషన్ ట్యాంక్ పనులు జరుగుతున్నాయి ఈ పనులు పూర్తి అయితే పట్టణానికి నీటి సమస్య ఉండదు. పట్టణ ప్రజలకు ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండా పనులను అలా డిజైన్ చేశాము.

ముఖా ముఖి

వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో యనకండ్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నొస్సం సాంబశివారెడ్డి, నొసం మహేశ్వర రెడ్డి, గొల్ల బ్రహ్మం, గడ్డం భాస్కర్ రెడ్డితోపాటు 10 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సొంత గ్రామం యనకండ్లకు చెందిన టిడిపి నాయకులు వైసిపి లో చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైసిపిలో చేరిన వారందరికీ సముచిత స్థానాన్ని కల్పిస్తానని చెప్పారు. కార్యక్రమంలో యనకండ్ల గ్రామ వైసిపి నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, బనగానపల్లె నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సాదుల శివశంకర్ రెడ్డి, బొబ్బల రాజశేఖర్ రెడ్డి, బొబ్బల రామ్మోహన్ రెడ్డి, శేషన్న యాదవ్, బొబ్బల నాగేంద్రారెడ్డి, సంజీవ గౌడ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యుడు మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యుడు, ఆటో డ్రైవర్ రాము (24) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు గుంతకల్ భాషా, మద్దిలేటి స్వామి, సభ్యులు అక్కడికి చేరుకుని రాము మృతదేహంపై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆటో వర్కర్స్ యూనియన్ నుండి 3 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. వారితో పాటు ఆటో వర్కర్స్ సభ్యులు పుల్లయ్య, రామాంజనేయులు, కత్తి రవి, నరేంద్ర, దినేష్, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు
- ఐపిఎస్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఐపిఎస్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విజయ రాణి సెంథిల్ కుమార్, సభ్యులు కె.కళ్యాణి రఘువీర్ రెడ్డి తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐపిఎస్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.గీతిక రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని సౌజన్య ఫంక్షన్ హాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విజయ రాణి సెంథిల్ కుమార్, సభ్యులు కె.కళ్యాణి రఘువీర్ రెడ్డి హాజరై మాట్లాడారు. అమెరికాలో 1908లో కార్మిక ఉద్యమం ప్రారంభమైందని, ఆ ఉద్యమంలో దాదాపు 15 వేల మంది మహిళలు పాల్గొన్నారన్నారు. వారంతా తమ హక్కులను డిమాండ్ చేస్తూ న్యూయార్క్ వీధుల్లోకి ఒక్క సారిగా వచ్చారని, పని గంటలు తగ్గించి వేతనాలు పెంచాలన్నది శ్రామిక మహిళల డిమాండ్‌గా ఆనాడు పోరాడి సాధించుకున్నారని తెలిపారు. ఈ ఉద్యమంలో మహిళలకు ఓటు హక్కు కల్పించాలనే డిమాండ్లు కూడా చేశారని చెప్పారు. దీంతో అప్పటి ప్రభుత్వం వారి కష్టాలను దృష్టిలో పెట్టుకుని పరిష్కారం దిశగా మార్పులు చేసిందని, 1909లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించిందని తెలిపారు. దేశ అభివృద్ధిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు రాణిస్తున్నా రన్నారు. అయినప్పటికీ చాలా దేశాల్లో మగవారితో సమానమైన గౌరవం, అవకాశాలు స్త్రీలకు లభించడం లేదని, కొన్ని దేశాల్లో మహిళలు కటుంబమనే నాలుగు గోడల మధ్యే నలిగిపోతున్నారని ఆవేదన చెందారు. చాలా దేశాలు మహిళలను క్రీడా, రాజకీయాల, రక్షణ మంత్రిత్వ శాఖ, సైనిక రంగాలంలో ప్రోత్సహించడానికి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. మహిళల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దిశ యాప్ వల్ల ఆపద సమయంలో మన వద్ద ఒక పోలీస్ రక్షణగా ఉన్నాడన్న భావన కలిగించే విధంగా ఎపి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. శాంతిరాం హాస్పిటల్ వైద్యులు హర్షిత, లికిత, జిఎస్ఆర్ హాస్పిటల్ నుండి మానసిక వైద్యురాలు హరీఫా భాను మాట్లాడుతూ మహిళలు ప్రతి విషయంలో ముందుండి ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకునేలా కృషి చేయాలన్నారు. అనంతరం నంద్యాల జిల్లాలోని సుమారు 300 మంది మహిళా కానిస్టేబుళ్లకు, పోలీసు కుటుంబ సభ్యులకు శాంతిరాం హాస్పిటల్ వారి సహకారంతో ఉచితంగా మెడికల్ చెకప్ నిర్వహించారు. దాదాపు ఒక లక్ష 50 వేల రూపాయల విలువ చేసే పలు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విజయ రాణి సెంథిల్ కుమార్, సభ్యులు కె.కళ్యాణి రఘువీర్ రెడ్డి

జోరుగా గ్రావెల్ మట్టి అక్రమ రవాణా

- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండల పరిధిలోని బసాపురం గ్రామ సమీపంలోని పొలాల నుండి జెసిబితో అక్రమంగా గ్రావెల్ మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా జోరుగా తరలిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆదాయ వనరు అయినప్పటికీ యథేచ్ఛగా మట్టి మాఫియా జెసిబి మిషన్ల ద్వారా తవ్వుకుంటూ లక్షలు గడిస్తున్నారు. ఇరిగేషన్ ప్రదేశాలలో, రెవెన్యూ ప్రదేశాలలో మట్టిని తరలించేందుకు రెవెన్యూ శాఖకు తగిన చలానా రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కానీ అటువంటి పరిస్థితి మండలంలో లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయల మేర గండి పడుతోంది. ఇక్కడ మట్టిని తవ్వుకోవడానికి పర్మిషన్ ఎవరిచ్చారని రైతులు, గ్రామస్తులు ప్రశ్నించగా మండల రెవెన్యూ అధికారులు, పోలీసులే అడగడం లేదని, మీరెవరు అడగడానికి, ఆపడానికి అంటూ దుర్భాషలాడుతూ అక్రమంగా మట్టి తరలిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఏ విధమైన అనుమతులు లేకుండానే అక్రమంగా గ్రావెల్ మట్టి రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కొంత మంది అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో సైతం జెసిబితో గ్రావెల్ తవ్వుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. మహానంది మండల పరిధిలోని బసాపురం గ్రామం నుంచి జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేసి ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



శోభాఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంచు మనోజ్ దంపతులు

భూమా దంపతులకు మంచు మనోజ్, భూమా మౌనిక నివాళి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని శోభా ఘాట్‌లో భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి సమాధుల వద్ద నవ దంపతులు మంచు మనోజ్, భూమా మౌనిక రెడ్డిలు ఆదివారం నివాళులు అర్పించారు. హైదరాబాద్ నుంచి ఆళ్లగడ్డకు చేరుకొని వారు భూమా దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. భూమా ఆభిమానులు పెద్ద ఎత్తున వచ్చి నవ దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ దంపతులు, యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి నివాళుల కార్యక్రమంలో పాల్గొన్నారు. భూమా అభిమానులను, టిడిపి నాయకులను మంచు మనోజ్‌కు పరిచయం చేశారు. టిడిపి నంద్యాల పార్లమెంటు అధికార ప్రతినిధి రాము యాదవ్, కౌన్సిలర్ పసలభారతి, డాక్టర్ వంశీకృష్ణ యాదవ్ తదితరులు నవ దంపతులకు అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి జ్ఞాపిక అందజేశారు. అనంతరం భూమా నివాసంలో ఆళ్లగడ్డ, నంద్యాలకు చెందిన టిడిపి నాయకులకు మాజీ మంత్రి అఖిల ప్రియ విందు ఏర్పాటు చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు, రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు పౌష్టికాహారాన్ని రాధాకృష్ణ స్వీట్ షాప్ యాజమాన్యం ఆర్థిక సహాయంతో ప్రార్థన సమయం నిర్వాహకులు జానప్రభాకర్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు, గర్భవతులకు, బాలింతలకు రొట్టె, పప్పు, గుడ్డు దాతల సహాయ సహకారాలతో పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంచి కోసం ప్రతి ఒక్కరు సహకరిస్తున్నారని అన్నారు. దాతలు ముందుకు వస్తే ఇంకా అనేక కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో హోసన్న వృద్ధాశ్రమం సూపర్వైజర్ కే.భారతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్

కోడ్ ఉల్లంఘిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. అధికార వైసిపికి చెందిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వర్గానికి చెందిన నాయకులు మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ పేరుతో అబ్దుల్ గఫార్ ఫ్లెక్సీలు పట్టణంలోని పగిడ్యాల రోడ్డు మార్గంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జన్మదిన ఫ్లెక్సీలు వెలిశాయి. ఎన్నికల కోడ్ పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కోడ్ ఉల్లంఘించిన అధికార పార్టీ నేతలపై తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు కోరుతున్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

(5వ పేజీ తరువాయి...) ఆవాజ్ నాయకుడు అక్బర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు విజయ్, ఆర్ఐఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ గౌడ్, నాయకులు మాణిక్యం, సుబ్బరాయుడు, బాబు, వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, డాక్టర్ పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుందామని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, యుటిఎఫ్ నాయకులు బాలాజీ రావు, ఎస్‌టియు జిల్లా ఆర్థిక కార్యదర్శి శివ ప్రసాద్, నాయకులు బాలాజీ నాయక్, డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ఏ.రణధీర్, సిఐటియు పట్టణ కార్యదర్శి డి. రామ్ నాయక్‌లు కోరారు. పట్టణంలోని కిషన్ సింగ్ స్ట్రీట్, జిన్నా పుల్లయ్య వీధి, శ్రీరామ్ నగర్‌లలో ప్రచారం నిర్వహించారు. అలాగే మండలంలోని కరివేన, కురుకుంద గ్రామాల్లో గిరిజన సంఘం నాయకులు నరసింహనాయుడు, వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు మహబూబ్ బాషా తదితరులు ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, డాక్టర్ పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. **రుద్రవరం :** ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రుద్రవరంలో ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు తలారి రామచంద్రుడు, శంకర్, భాస్కర్ బాల మద్దిలేటి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంధం మల్లేశ్వర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు రామాంజనేయులు, దళిత సమాఖ్య నాయకుడు గుర్రప్ప, మాల మహానాడు నాయకుడు చంటి ఓబయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. **నందికొట్కూరు :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని వాల్మీకి నగర్, వడ్డే పేట కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు ఓబన్న నాయుడు, భాస్కర్ గౌడ్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని ఎపిటియుసి నాయకులు కోరారు. భూమన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడారు. నాయకులు సుంకయ్య, శివ బాలకృష్ణ, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రుద్రవరం : పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు,

నందికొట్కూరు : పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రంగాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సౌత్ వెస్ట్ మైనింగ్ కంపెనీ సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జస్వంత్ రెడ్డి, సునీల్ కుమార్‌లు పేర్కొన్నారు. రంగాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చి సేవలు పొందారు. వైద్యులు వారికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సత్తార్, వీరారెడ్డి, మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు.

అక్షయపాత్ర భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు భోజన సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అక్షయ పాత్ర హిందూ అన్నదాన సత్రాన్ని ఆలయ ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి ఆదివారం ప్రారంభించారు. ఆలయ ముఖ ద్వారం సమీపంలో నంద్యాలకు చెందిన హిందూ అన్నదాన సత్రం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. దేవస్థానం పర్యాటక సీనియర్ గైడ్ సంజీవ పాల్గొని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా క్షేత్రంలో హిందూ సత్రంను ప్రతి ఏటా ఏర్పాటు చేస్తూ, యాత్రికులకు చక్కని భోజన సదుపాయం కల్పిస్తున్న సత్రం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కేంద్రం సిబ్బంది హరి, తదితరులు పాల్గొన్నారు.

భోజనశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

దిగువలో వైభవంగా కళ్యాణోత్సవం

- ఎగువలో అశ్వ వాహనంపై జ్వాలా నరసింహుడు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి, అమతవల్లి అమ్మవార్ల కళ్యాణోత్సవం రమణీయంగా జరిగింది. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఎదుర్కోల కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు ఎదుర్కోల కార్యక్రమం నిర్వహించిన తీరు చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవ మూర్తులను కళ్యాణ మండపానికి తీసుకెళ్లి అక్కడ సాంప్రదాయం ప్రకారం జీలకర్ర బెల్లం, కంకణ ధారణ, మాంగళ్యధారణ చేశారు. ఈ కళ్యాణ మహోత్సవానికి అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి హాజరై నూతన కళ్యాణమూర్తుల పాదాల చెంతన ముత్యాల తలంబ్రాలు పోశారు. పద్మశాలియ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి ప్రహ్లాద వరద స్వామి, అమతవల్లి అమ్మవార్ల కళ్యాణోత్సవం తిలకించారు.

టిటిడి తరఫున పట్టు వస్త్రాల సమర్పణ : దిగువ అహోబిలంలో జరుగుతున్న ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి టిటిడి తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్, టిటిడి సూపరిండెంట్ విభీషణ శర్మ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అంతకు ముందు అహోబిల మఠం పీఠాధిపతి స్వామిని వారు దర్శించుకొని ఆశీర్వాదాలు పొందారు.

ఎగువ అహోబిలంలో : పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు తొట్టి తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి జ్వాలా నరసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వ వాహనంపై ఆశీనులను చేసి పూజ నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు సగినేల వెంకటరమణ

ప్రజాశక్తి - పగిడ్యాల

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన మేరకు కృషి చేస్తానని వైసిపి ఎస్‌సి సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షులు సగినేల వెంకటరమణ అన్నారు. ఆదివారం పగిడ్యాల మండలం పడమర ప్రాతకోట గ్రామంలోని తన నివాసంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువ శ్రామిక, రైతు, కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవ చేస్తునందుకు గుర్తించి నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు అప్పజెప్పినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, నవరత్నాలను అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. కుల, మత, ప్రాంతం, పార్టీలు అనే తేడా లేకుండా అందరికీ సంక్షేమ పథకాల అందించాలని, జనం ప్రభుత్వం, జగనన్న ప్రభుత్వం అనే నినాదంతో ఎమ్మెల్యే ఆర్థర్ ముందుకు సాగుతున్నారని చెప్పారు. సిఎం జగనన్న, ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి విద్య దీవెన, వసతి దీవెన, రైతు భరోస, వైఎస్ఆర్ చేయూత, పొదుపు మహిళలకు సున్నా వడ్డీ, పింఛన్లు పెంపు వంటి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని నిరోధించాలని, ప్రజల వద్దకే పాలన అంటూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నూతన వ్యవస్థకు నాంది పలికిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందించేందుకు వాలంటీర్ వ్యవస్థను జగనన్న ఏర్పాటు చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించాడానికి కృషి చేస్తానన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రాజు, సుబ్బన్న, మసీదుల సుభాన్, వెంకటేశ్వర్లు, రామసుబ్బరెడ్డి, రామకృష్ణ, రాముడు, అంకన్న, రమణ, రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

కవి కొప్పుల ప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి - నంద్యాల

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వినాయక డెవలపర్స్ వారి సౌజన్యంతో తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ, పాలమూరు, అక్షర కౌముది సంస్థ హైదరాబాద్ వారి అధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగిన కవి సమ్మేళనంలో నంద్యాల చెందిన రచయిత కొప్పుల ప్రసాద్ పాల్గొన్ని 'బాంధవ్యాల యుద్ధంలో స్త్రీ స్వరూపం' అనే కవిత గానం చేసినందుకు జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, రావూరి వనజ, తులసి వెంకట రమణా చార్యులు పాల్గొన్నారు. కొప్పుల ప్రసాద్‌కు నంద్యాలకు చెందిన సాహితీ అభిమానులు, సాహితీ మిత్రులు,పుర ప్రముఖులు, నలంద కళాశాలలు యాజమాన్యం, లెక్చరర్స్, మల్లేశ్వర రెడ్డి స్కూల్ కరస్పాండెంట్, కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ రవికృష్ణ అభినందనలు తెలిపారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

- రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు

ప్రజాశక్తి - రుద్రవరం

అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యతని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎగువ, దిగువ అహోబిలంతో పాటు కాశిరెడ్డి నాయన, తదితర ప్రాంతాలలో భక్తులు వంటలు చేసుకుని మంటలను ఆర్పకుండా ఉండటం వల్ల అడవులకు మంటలు వ్యాపించి విలువైన అటవీ సంపద నష్టపోతామనానరు. అడవుల్లో ఉండే వృక్ష సంపదతో పాటు వనమూలికలు, వన్యప్రాణులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. భక్తులు వంట చేసుకుని మంటలను అలాగే వదిలేయకుండా ఆర్పి వేయాలన్నారు. ప్లాస్టిక్ పదార్థాలను, వస్తువులను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల వాటిని పక్షులు, జంతువులు తిని చనిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున భక్తులు అడవుల్లో సంచరించే సమయంలో ధూమపానం సేవించి నిప్పు అక్కడే పడవేయవద్దన్నారు. అటవీ సిబ్బంది కూడా పలు ప్రాంతాలలో సంచరిస్తున్నారని, భక్తులు వారికి సహకరించాలని కోరారు. **బండి ఆత్మకూర్ :** అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని బండి ఆత్మకూర్ అటవీశాఖ అధికారి నసీర్జా తెలిపారు. ఆదివారం మండలంలోనిఅటవీ సమీప గ్రామాలైన నారాయణపురం, జి.సి పాలెం, లింగాపురం గ్రామాల్లో అటవీ సంరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ వేసవికాలం కావడంతో అడవులకు నిప్పు పెట్టడం, వన్యప్రాణులను వేటాడడం లాంటి చర్యలకు పాల్పడితే పిడి యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది ఎఫ్‌బిఓ మదార్, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు కనీస వసతులు సమకూర్చండి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు కనీస వసతులు కల్పించాలని కళాశాల ప్రిన్సిపల్ శివారెడ్డి రోటరీ క్లబ్ వారిని కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రెసిడెంట్ ఎలెక్ట్ పేరూరి విజయ్, ఆళ్లగడ్డ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆళ్లగడ్డకు కొత్తగా డిగ్రీ కాలేజీలో కనీస వసతులు కూడా లేవన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ప్రెసిడెంట్ హరీష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీనాథ్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్, రోటరీ క్లబ్ సభ్యులు శంకర్ రెడ్డి, రత్న రాజు, నర్సిరెడ్డి, బైసాని రవి ప్రకాష్, శబరీష్ సత్యం, పోలేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి : టిఎన్‌టియుసి

ప్రజాశక్తి - చాగలమర్రి

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం చాగలమర్రి పట్టణంలోని గాంధీసెంటర్ వద్ద టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు ఆధ్వర్యంలో కాంగ్రెస్, హమాలీ సంఘ నాయకులతో కలిసి గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు పన్నులు, గ్యాస్ ధరలు పెంచుతూ పేదల నడ్డి విరుస్తున్నాయన్నారు. పెంచిన ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించకుంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పాపాజీ, టిడిపి నాయకులు నాగశేషు, హమాలీ సంఘ కార్యదర్శి నమాజ్, కోశాధికారి సుబహాన్, షరీఫ్, మహబూబ్ బాష, రసూల్, మహబూబ్ పీరా తదితరులు పాల్గొన్నారు.

గుత్తి నుండి అహోబిలానికి కాలినడకన భక్తులు

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

అనంతపురం జిల్లా గుత్తి మండలం తొండపాడు, క్రిష్టిపాడు గ్రామాలు, పెద్దవడుగూరు మండలం నుండి 60 మంది భక్తులు ఆళ్లగడ్డ మండలం అహోబిలం క్షేత్రానికి కాలినడకన బయలుదేరారు. వీరు ఆదివారం ఉయ్యాలవాడ గ్రామం చేరుకున్నారు. రూపనగుడిలోని గ్రామం దగ్గర కుందూ ఒడ్డున వెలసిన వేణుగోపాల స్వామి ఆశ్రమంలో ఆశ్రమ వాసులు వీరికి అన్నదానం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కృష్ణమూర్తి, నాగభూషణం, విధేయుడు, నరేంద్ర, తిరుపాలు, నాగ రాజశేఖర్, శ్రీరాములు, శ్రీహరి, నాగార్జున, మల్లికార్జున తదితరులతో పాటు 60 మంది 15 సంవత్సరాలుగా ఇలాగే కాలిన బయలుదేరి నాలుగు రోజులపాటు కాలినడకతో బ్రహ్మోత్సవాల సమయానికి అహోబిలం చేరుకుని స్వామివారి దర్శించుకుని మొక్కలు

పురుగు పట్టి, మగ్గి, దుర్వాసనతో కంది బేడలు

- అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా
- పప్పు, చారు తినలేక పడేస్తున్న వైనం
- అవస్థలు పడుతున్న గర్భిణులు, పిల్లలు

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు పురుగు పట్టి, మగ్గిపోయి, దుర్వాసన వస్తున్న కందిబేడలను పంపిణీ చేయడంతో వాటితో వండిన పప్పును తినలేక బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు అవస్థలు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ మహిళలకు బాలింతలకు సున్నా నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తుంది. అయితే ప్రభుత్వం సరఫరా చేసే కందిబేడలు, నూనె, పాలు నాణ్యత లేనివి, వాసన వచ్చే వాటిని పంపిణీ చేస్తున్నడంతో వాటిని తినలేక, తాగలేక గర్భిణులు, బాలింతలు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు పురుగు పట్టి, మగ్గిపోయిన కందిబేలను పంపిణీ చేశారు. ఈ కందిబేడలతో వండిన పప్పు, సాంబారు తినలేక పడేస్తున్నారు. అంగన్వాడీ సిబ్బందిపై బాలింతలు, గర్భిణీలు, పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుండి సరఫరా అయిన వాటిని మాత్రమే తాము వండుతున్నామని సిబ్బంది తెలుపుతున్నా వారు వినకుండా సిబ్బందికి చీవాట్లు పెడుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన బియ్యం, కందిబేడలు, నూనె, పాలు పంపిణీ చేయాలని గర్భిణులు, బాలింతలు, పిల్లలు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పురుగు పట్టిన కందిబేడలు

శాస్త్రోక్తంగా కామ దహనం

ప్రజాశక్తి - శ్రీశైలం

హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో శాస్త్రోక్తంగా కామ దహన కార్యక్రమాన్ని దేవస్థానం వారు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో గంగాధర మండపం వద్దకు సంప్రదాయబద్ధంగా వేదమంత్రాలు మధ్య తీసుకువచ్చారు. గంగాధర మండపం వద్ద గడ్డితో ఏర్పాటు చేసిన మన్మధ రూపాన్ని దహనం చేశారు. ఆ తర్వాత ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

రమణీయం రథోత్సవం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల రథోత్సవం ఆదివారం కనుల పండువగా, రమణీయంగా నిర్వహించారు. ఈ రథోత్సవం గ్రామ సర్పంచి కొంగర నవీన్, ఆలయ ధర్మకర్త కిరణ్ కుమార్, ఇఒ కార్తీక్ ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. ఆలయ అర్చకులు సుబ్రమణ్యం శర్మ స్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ విచ్చేసారు. ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుశ్శాలువాలతో ఆలయ అధికారులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. రథోత్సవంలో నందికొట్కూరు మండలం నాగటూరు, బిజినేముల, పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందికొట్కూరు అర్బన్ సీఐ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎన్‌వి రమణ, పాములపాడు ఎస్సై అశోక్ బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచి భాస్కర్ రెడ్డి, ఎంపిటిసి చందమాల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు చిన్న పుల్లయ్య, వేణు గోపాల్, విజయ లక్ష్మి, నాగ లక్ష్మమ్మ, రామేశ్వరమ్మ, కళావతమ్మ, సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉసేనయ్య, వైసిపి నాయకులు తమ్మడపల్లి విక్టర్, రైతు సంఘం నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

స్వామి వారి హారతిని తీసుకుంటున్న ఎమ్మెల్యే తోగురు ఆర్థర్

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అభినందనీయం

ప్రజాశక్తి - మహానంది

సమాజ అభివృద్ధిఇలో మహిళల పాత్ర అభినందనీయమని విశ్రాంత ఉపాధ్యాయిని, సమాజ సేవకురాలు వసుమతి పేర్కొన్నారు. మహానంది పుణ్యక్షేత్రం పరిధిలోని ఈశ్వర్ నగర్ కాలనీలో స్థానిక అంగన్వాడీ కార్యకర్త ఫాతిమా, మేరీ, రాణి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం గిరిజన మహిళలతో పాటు బడుగు బలహీనవర్గాలకు చెందిన గర్భవతులకు సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు మహిళ అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందని తెలిపారు. ఇందుకు వారి వారి కుటుంబాల పురుషులు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చలం శిరీష, నంద్యాల నుంచి వచ్చిన మహిళా సంఘం ప్రతినిధులు కుసుమకుమారి, భాగ్యలక్ష్మి, శాంతి, సురేఖ, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, బిబి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయానికి రూ. 2.25 లక్షలు విరాళం

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచర్ల మండలం రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం పున:నిర్మాణానికి రూ. 2 లక్షల 25 వేలు కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన బాల మద్దయ్య గౌడ్, కాశీ విశ్వనాథ్ జ్ఞాపకార్థంగా తులసీనాథ్ గౌడ్ విరాళంగా ఆదివారం అందజేశారు. స్వామివారి ఆలయంలో రాత్రి విగ్రహాలు, నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ పనుల నిమిత్తం భక్తుడు తులసీనాథ్ గౌడ్ విరాళాన్ని ఆలయ ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడులకు అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బంది మద్దిలేటి స్వామి, మద్దయ్య, తదితరులు కలిసి దాతను శాలువాలతో సత్కరించారు.

మహానందిలో వైభవంగా 16 రోజుల పండగ

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవక్షేత్రం మహానందిలో మహా శివరాత్రి పర్వదినం రోజున నూతన కల్యాణ వధువరూలైన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్ల పదహారు రోజుల పండగ వేడుకల పూజా కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఏఈఓ ఎర్రమల మధు, వేదపండితులచే పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విశేష నివేదనం నిర్వహించి అంకురాలను ప్రదర్శనగా తీసుకువచ్చి రుద్రగుండం పుష్కరిణిలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రథశాల వద్దకు చేరుకొని రథానికి పూజలు నిర్వహించి రథాంగ దేవతలకు ఉద్వాసన పలికారు. దీంతో వధూవరుల దీక్ష విరమణ జరిగినట్లు వేదపండితులు తెలిపారు. ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి : ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించా లని ప్రభుత్వం పెన్షన్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బనగానపల్లె డివిజన్ స్థాయి పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పెన్షన్ డబ్బులు ఒకటవ తేదీన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని కోరారు. అనంతరం పెన్షనర్ల సంఘం డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ అధ్యక్షులుగా ఐ పక్కీరా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కూడాల శంకర్ రెడ్డి, ట్రెజరర్ చల్లా బాలస్వామి, గౌరవ అధ్యక్షులుగా జీఎం నాయక్, అసోసి యేట్ అధ్యక్షులుగా ఎస్ రామసుబ్బయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. నాయకులు శివయ్య, మహబూబ్ బాషా, వెంకటరామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, శర్మ, నాగరాజు, ఇస్మాయిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంచార పశు వైద్యసేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - పగిడ్యాల

వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవలను పశు పోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ పశు వైద్యాధికారి డాక్టర్ కేజియా అన్నారు. ఆదివారం మండలంలోని ఎం ఘణపురం గ్రామంలో పశువులకు ఆమె చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఘణపురం గ్రామంలో బర్రెకు పొదుగు వాపు రావడంతో యజమాని ఈశ్వరమ్మ 1962కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వచ్చి చికిత్స చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులో ఉన్నా సమాచారం అందిస్తే పశువు పరిస్థితిని బట్టి ఇక్కడే చికిత్స అవసరమైతే ఉన్న చోటే చికిత్స చేస్తామన్నారు. లేదా వాహనంలో నందికొట్కూరు తరలించి మెరుగైన చికిత్స చేస్తామన్నారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలో వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు రెండు ఉన్నాయని, రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్ ఎం.కేజియా

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : ఆత్మకూరు
ఐ.పి. నెం.3/2021
కురువ లక్ష్మి. ...పిటిషనరు
వర్సస్
డి.పుష్పమ్మ మరియు ఇతరులు. ...రెస్పాండెంట్
నెం. 24 రెస్పాండెంట్ కి ఐ.పి.నోటీసు
ఇ.శ్రీనివాసులు, తండ్రి పేరు వెంకటేశ్వర్లు,
ఇంటి నెం.7-34-13/1, సాయిబాబ గుడి లైను
కొత్తపేట, శ్రీశైలము ప్రాజెక్టు, సెల్ నెం. 9492611564
పైన తెలిపిన పిటిషనరు తనను దివాలాదారుగా ప్రకటించమని ఐ.పి. దాఖలు చేసియున్నారు. పై ఐ.పి.లో మీకు 24వ రెస్పాంటెంట్ గా పలుమార్లు కోర్టువారు నోటీసులు పంపినను మీరు తీసు కోకపోవడము వలన ఈ పత్రిక ద్వారా నోటీసులు పంపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు గాని మీ తరపున వకీలు ద్వారా గాని ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 21-03-2023న ఉదయము 10.30 గంటలకు హాజరు అయ్యి తెలుపుకునేది లేని ఎడల మీ పరోక్షమందు ఈ ఐ.పి.ని తీర్మాణించబడును.
(కోర్టు వారు ఉత్తర్వుల మేరకు)
పిటిషనరు తరుపున న్యాయవాధులు
వి.రవికుమార్ - 7396397328
జె.ప్రభాకర్ - 9949931034
అడ్వకేట్లు, కర్నూలు
వాయిదా తేది. 21-03-2023
ఉదయము 10.30 గంటలకు